క్లుప్తంగా

‘సహజయోగ’ భవన నిర్మాణానికి భూమిపూజ



తెనాలిటౌన్: పట్టణ నాజ్‌పేటలోని మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ధ్యాన మండలి భవనానికి గురువారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ భూమి పూజ చేశారు. మాతాజీ నిర్మలాదేవి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. సహజయోగ ధ్యానమండలి సభ్యులు ప్రవచనం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, బూరెల దుర్గాప్రసాద్, యోగ మండలి సభ్యులు పాల్గొన్నారు.

రచయిత జవహర్‌బాబుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం కంచుకోట చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం తీర్పు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కళాకారుడు, రచయిత బిళ్ల జవహర్‌బాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాడిబోయిన హరిప్రసాద్, పినపాటి సురేష్‌బాబు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవానీ, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాలకు ఎన్టీఆర్ విగ్రహాలు..

తెనాలి: విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీరామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా వివిధ దేశాల్లోని ఎన్టీఆర్ అభిమానుల కోసం స్థానిక సూర్యశిల్పశాల శిల్పులు ఆయన విగ్రహాలను తయారుచేశారు. అమెరికా, ఆస్ట్రేలియా, కాలిఫోర్నియా, జర్మనీ, కెనడా దేశాల నుంచి వచ్చిన ఆర్డర్లపై ఎన్టీఆర్ బస్ట్ సైజు విగ్రహాలను సిద్ధం చేసినట్టు శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గతంలో చేసిన ఎన్టీఆర్ విగ్రహాలు సజీవంగా ఉన్నాయన్న భావనతో శతజయంతి ఉత్సవాల్లో తమ సంప్రదించారని, కొత్తగా చేసిన విగ్రహాలను ఆయా దేశాలకు తరలిస్తున్నట్టు తెలిపారు.

అన్నదానం, పండ్లు పంపిణీ

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవా శాంతి ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవాకేంద్ర సభ్యులు, శ్రీకాకుళం అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న టీపీ విఠలేశ్వర్ 60వ పుట్టిన రోజు వేడుకలను గురువారం తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హెచ్ఎం కుర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ టీపీ విఠలేశ్వర్ తెనాలిలో డీఎస్పీగా పనిచేసి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు తమ సందేశాలను అందజేశారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈసందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. ఎస్వీయోగ కన్వీనర్ రమణయ్య, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, మురళి, భారతి, అనూష, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని గ్రేడ్ -1 శాఖాగ్రంథాలయంలో ఈనెల 8వ తేదీనుంచి పాఠశాల విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. 16వ తేదీవరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల్నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే శిబిరంలో రిసోర్స్ పర్సన్స్ స్వచ్ఛందంగా ముందుకొచ్చి విద్యార్థులకు శిక్షణనిస్తారని గ్రేడ్-2 లైబ్రేరియన్ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కథ చెప్పటం, ఇంగ్లిష్ మాట్లాడటం, చిత్రలేఖనం, నృత్యం, క్యారమ్స్, ఇండోర్ గేమ్స్‌లో శిక్షణ ఉంటుదని, విద్యార్థులు ఎలాంటి ఫీజు చెల్లించనవసరం లేదని తెలిపారు. ఆలపాటి కళావతి రవీంద్రపీఠం అధ్యక్షుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావుచే 8వ తేదీ ఉదయం 10 గంటలకు శిక్షణ శిబిరం ప్రారంభం కాగలదని వివరించారు.

187 మందికి కంటి పరీక్షలు

రేపల్లె రూరల్: చెరుకుపల్లికి చెందిన శ్రీ కామాక్షి ఐ కేర్ ఆసుపత్రి వైద్యులు పోటుమెరక గ్రామంలోని ఎంపీయూపీ స్కూలులో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు వాసుదేవరా, రాజేష్ 187 మందికి ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాగితాల హనుమ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం..పేరంటాలమ్మ ఉత్సవం

- గౌరమ్మ- వెంకయ్య ఆలయానికి 200 ఏళ్ల చరిత్ర
- ఘనంగా గుమ్మడి శిడి ఊరేగింపు



పట్టణంలో జరిగిన గుమ్మడి శిడి ఊరేగింపు



గౌరమ్మ-వెంకయ్యల శిలా విగ్రహాలు.. ఎదుట ఉత్సవ విగ్రహాలు

తెనాలి: పట్టణ అయితానగర్‌లో గౌరమ్మ-వెంకయ్యల దేవాలయంలో పేరంటాల్లమ్మ తిరునాళ్ల వైభవంగా జరుగుతోంది. భక్తబృందం ఆధ్వర్యంలో జరిగే తిరునాళ్ల ఈనెల ఒకటో తేదీన అఖండ దీపారాధన, ప్రతిమల ఊరేగింపుతో ఆరంభమైంది. 3న తేదీ సాయంత్రం గుమ్మడి శిడి, 4న జలబిందెలు, పూలకప్పెర సాగాయి. చివరిరోజైన శుక్రవారం మధ్యాహ్నం నుంచి పొంగళ్లు, మొక్కుబడులు, గండదీపాలు, పసుపు బళ్లు, కరెంటు ప్రభలు, మేక శిడి వంటి సంప్రదాయ వేడుకలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఘనంగా జరగనున్నాయి. అయితానగర్‌కు చెందినవారే కాకుండా ఎక్కడెక్కడో స్థిరపడ్డ ఆ గ్రామవాసులు తిరునాళ్లలో పాల్గొంటారు. మొక్కు లు మొక్కుకోవటం, కోర్కెలు నెరవేరినవారు తీర్చుకోవటం ఆనవాయితీ. ఈ ఆలయం, ఉత్సవం వెనుక 200 ఏళ్లకు పైగా అనుశ్రుత చరిత్ర ఉంది.

ఇదీ చరిత్ర..

ఆ కాలంలో తెనాలి ప్రాంతాన్ని ముస్లింరాజులు పరిపాలిస్తున్నారు. ఉన్నతాధికారి ఒకరు తహసీల్దార్‌గా, అయితానగర్‌కు మునసబు, మోతాదులు, వెట్టివారు ఉండేవారు. తెనాలికి 23 కిలోమీటర్ల దూరంలోని కొల్లూరులో జన్మించిన పోటూరి గౌరమ్మ పెద్దబాలశిక్ష చదువుకుంది. అల్లారుముద్దుగా పెరిగిన తనను అయితానగర ప్పాడు (నేటి అయితానగర్) నివాసి కన్నెగంటి వెంకయ్యకు ఇచ్చి పెళ్లి చేశారు. వీరి దాంపత్యజీవనంలో ఒక ఆడపిల్ల జన్మించింది. మళ్లీ కొన్నేళ్లకు గౌరమ్మ గర్భం దాల్చింది. ఒకరోజు చింతతోపులో పశువులను మేపుతున్న వెంకయ్య, చింతచిగురు తీసుకెళ్లి భార్యకు పులుపు తినిపించాలని తలపోశాడు. చింతచెట్టు ఎక్కి, పట్టుతప్పి కింద పడి మృతిచెందాడు.

తెనాలి ప్రాంతంలో తొలి సహగమనం...

గ్రామస్తులు తీసుకొచ్చిన వెంకయ్య మృతదేహంపై పడి గౌరమ్మ విలపించింది. భర్త లేని జీవితం వ్యర్థమని నిర్ణయించుకొన్న గౌరమ్మ, భర్తతో పాటు తాను సహగమనం చేస్తానంటూ ప్రకటించింది. మునసబు, మోతాదుల ద్వారా విషయం తెలుసుకున్న తహసీల్దార్ హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. గౌరమ్మ సతీసహగమనాన్ని నిరోధించేందుకు ప్రయత్నించారు. అప్పటికే పేర్చి పెట్టిన చితిపై ఉంచి పతి వెంకయ్యకు నిప్పంటించగా, కణకణమండే చితిలో నిర్భయంగా గౌరమ్మ సహగమనం చేసింది. చితిలో రగులుతూ తనకు అదేచోట గుడి కట్టించాలనీ, తన కుమార్తెను స్నేహితురాలి కుమారుడుకిచ్చి వివాహం చేయాలని కోరిందట గౌరమ్మ. తాను, తన భర్త శిలలుగా వెలుస్తామనీ, గ్రామానికి రక్షణగా ఉంటామని, కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని చెప్పింది.

1894లో ఆలయ నిర్మాణం..

ఆ చితి ప్రదేశంలోనే కొన్నాళ్లకు గౌరమ్మ-వెంకయ్య శిలలు వెలిశాయి. పూరిపాక వేసి, గ్రామస్తులు పూజలు చేయటం ఆరంభించారు. అప్పట్లో కలరా, మశూచి, పొంగు జ్వరాలు విపరీతంగా వుండేవి. గౌరమ్మని కొలిస్తే వాటిని నివారించిందని అయితానగర్ ప్రజల విశ్వాసం. గుడి బాధ్యతలు చూస్తుండే మునసబుకు కలలో కనిపించిన గౌరమ్మ, వైశాఖ ఏకాదశి రోజున అఖండ దీపారాధనతో ఉత్సవాన్ని ప్రారంభించి, నాలుగు రోజులు ఎలా నిర్వహించాలనేది ఆదేశించినట్టు చెబుతారు. అప్పట్నుంచి వైశాఖ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు వేడుకగా నిర్వహిస్తున్నారు. ఆలయానికి పూరిపాక స్థానంలో 1894లో ఇటుకలతో శ్లాబు వేశారు. అదే ఏడాది కొలకలూరు నుంచి అంకమ్మ విగ్రహం అన్నాబత్తుని రామయ్యకు లభ్యంకాగా దానిని ఆలయ దక్షిణ భాగంలో ప్రతిష్ఠించారు. తర్వాత కాంక్రీటు శ్లాబు వేయించారు. గోపుర శిఖరం ఏర్పాటుచేశారు. ముఖ మండపం విశాలపరచి, గుడిచుట్టూ ఇనుప గ్రిల్స్ వేశారు. నాపరాయి పరిచారు. కొంతభాగం మొజాయిక్ ఫ్లోర్ చేశారు. విద్యుత్‌సౌకర్యం కల్పించారు.

బంధుమిత్రులతో కోలాహలం..

తిరునాళ్లలో గుమ్మడి శిడి, మేక శిడి లాగేందుకు యువకులు పోటీపడుతుంటారు. మాను లాగుటం వల్ల వివాహమవుతుందని జనం నమ్మిక. తిరునాళ్ల రోజుల్లో ఆ ప్రాంతంలో గుడికి వెళ్లని వారు ఉండరని, ఐతానగర్‌వాసులు దూరపు బంధువులను ఆహ్వానించి అతిథి మర్యాదలు చేస్తారని, నాల్గవ తరం ఆలయ ట్రస్టీ కన్నెగంటి భాస్కరరావు చెప్పారు.

లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో విశేష పూజలు



తెనాలిటౌన్: నాజర్‌పేటలోని శృంగేరీ విరూపాక్ష పీఠపాలిత శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానంలో గురువారం స్వామివారి జయంతిని భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకాలు, పూజలు చేశారు. తొమ్మిది గంటల నుంచి శ్రీ నృసింహస్వామి వ్రతాలు జరిపారు. సాయంత్రం స్వామివారికి సహస్రనామార్చన పారాయణం జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షించారు.

ఫైనాన్స్ సంస్థ మేనేజర్‌పై దాడి

తెనాలిరూరల్: ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ మేనేజర్‌పై దాడి చేసి గాయపర్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన చంద్రశేఖర్ 2019లో ఓ ఫైనాన్స్ సంస్థ వద్ద కారు లోన్ తీసుకున్నాడు. వాయిదాలు చెల్లించకపోగా, ఫైనాన్స్ సంస్థ సిబ్బంది నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. ఎట్టకేలకు కారును సిబ్బంది బుధవారం గుర్తించారు. వాహనాన్ని ఫైనాన్స్ సంస్థ సిబ్బంది స్వాధీనం చేసుకుంటుండగా చంద్రశేఖర్, మరో ఇద్దరు సంస్థ మేనేజర్ మల్లోల నాగమల్లేశ్వరరావుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధితుడు తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి దాటాక కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో జోరుగా సంక్షేమం, అభివృద్ధి

‘గడప గడపకు’ కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి జోడు గుర్రాలుగా పాలన సాగుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం గ్రామంలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం గురువారం రాత్రి నాలుగో రోజుతో ముగిసింది. గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే శివకుమార్ ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాల వివరాలను తెలియజేస్తూ ముందుకు వెళ్లారు. ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను తెలియజేయడంతోపాటు వారి సమస్యలనూ తెలుసుకునే ప్రయత్నం చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. సంక్షేమ లబ్ధి అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. జగ్గడిగుంటపాలెం గ్రామంలో రూ.1.50 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని, రాబోయే కాలంలోనూ మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. బీసీవర్గాల ప్రజలు ఉండే గ్రామంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై నమ్మకం వ్యక్తమవుతోందని, ఈ కార్యక్రమం ద్వారా తేటతెల్లమైందని వివరించారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచి కుంభం బాలాజీ, ఎంపీటీసీ కాజా భద్రావతి బాలాజీ, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు పసుపులేటి వెంకయ్య, రాష్ట ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్లు యాతాటి అనిల్, షేక్‌దుబాయ్‌బాబు, పేరం సంజీవరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, ఉప సర్పంచి గోలి లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు భీమవరపు సంజీవరెడ్డి, అక్కిదాసు కిరణ్‌కుమార్, కఠారి హరీష్, ఆరాధ్యుల కోటేశ్వరరావు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆగ్రో ఇండస్ట్రీస్‌తో ఉపాధి కల్పన



చదలవాడ(వేమూరు): ఆగ్రో ఇండస్ట్రీస్ ఏర్పాటుతో ప్రజలకు జీవనోపాధి కల్పించడం జరుగుతుందని రాష్ట సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. చదలవాడ గ్రామంలో ఆగ్రో ఇండస్ట్రీస్‌ను ఆయన తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. ఈ పరిశ్రమ వల్ల జిల్లాలోని చాలా మందికి జీవనోపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, చదలవాడ గ్రామ సర్పంచ్ దాసరి రమేష్, బొల్లిముంత శ్రీనివాసరరావు, బొల్లిముంత వెంకటేశ్వరరావు, చందు అజయ్‌బాబు, కసుకుర్తి దాసు, సీహెచ్ మల్లికార్జునరావు, కొక్కిల గద్దరూపస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి చిన్న సినిమాను విడుదల చేయాల్సిందే

సినీ దర్శకుడు దిలీప్‌రాజా



తెనాలి: సెన్సార్ పూర్తి చేసుకున్న ప్రతి చిన్న సినిమా విడుదలకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా విజ్ఞప్తిచేశారు. దర్శకుల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మా-ఏపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందుకోసం సినీపెద్దలు, యూనియన్ల నాయకులతో చర్చించి ఒక కార్యాచరణను అమలుచేయటం అవసరమన్నారు. దేశంలో 3,763 సినిమా థియేటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 572, తెలంగాణలో 923 థియేటర్లు ఉన్నాయని చెబుతూ కొందరు పెద్దల చేతుల్లో థియేటర్లు ఉన్నందున పలు చిన్న సినిమాలు విడుదలకు నోచుకోవటం లేదన్నారు. పెద్ద సినిమాలకు నెలలో 20 రోజులు, చిన్న సినిమాలకు 10 రోజులు ప్రదర్శనకు అనుమతించాలని, విడుదలైన సినిమాను ప్రేక్షకులు ఆదరించకపోతే మూడో రోజున వేరే సినిమా ప్రదర్శించుకుని థియేటర్ల యాజమాన్యం నష్టపోకుండా ప్రత్యామ్నాయ చర్యలను రూపొందిస్తూ జీఓను తీసుకురావాలని ఉభయ తెలుగు రాష్ట ప్రభుత్వాలకు సూచించారు. ఇదే అంశంపై సంబంధితశాఖ మంత్రులు, ఫిలిం కార్పొరేషన్ బాధ్యులను సంప్రదించనున్నట్టు వివరించారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన

తెనాలిరూరల్: గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థతో రాష్ట్రంలో గత ప్రభుత్వాలకన్నా మెరుగైన పాలన జరుగుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యాలయ సిబ్బందికి కల్పించిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయాతో ప్రజలకు త్వరితిగతిన ప్రభుత్వ సేవలు అందుతున్నాయని చెప్పారు. అలానే స్థానిక సమస్యలూ పరిష్కారమవుతున్నారు. ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడంతో పాటు ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కుంభం బాలాజీ, ఎంపీటీసీ కాజా భద్రావతిబాలాజీ, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు పసుపులేటి వెంకయ్య, పంచాయతీ ఈఓ గుప్తా, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైశ్యవిద్యానిధి స్థలం పారదర్శకంగానే విక్రయం

విద్యానిధి కమిటీ కార్యదర్శి, సభ్యుల వివరణ



మాట్లాడుతున్న పెండేల వెంకట్రావు, విద్యానిధి కమిటీ సభ్యులు

తెనాలిరూరల్: పట్టణ శ్రీకన్యకాపరమేశ్వరి వైశ్యవిద్యానిధికి చెందిన నాజరుపేటలోని స్థలంలో కొంత భాగాన్ని పారదర్శకంగానే విక్రయించినట్టు వైశ్యవిద్యా నిధి కమిటీ వెల్లడించింది. వైశ్యవిద్యానిధి ఆవరణలో గురువారం విలేకరుల సమావేశంలో కమిటీ కార్యదర్శి పెండేల వెంకట్రావు, ఇతర సభ్యులు మాట్లాడుతూ సంబంధిత స్థలాన్ని దాతలు 1953లోనే విద్యానిధికి ఇచ్చినట్టు తెలిపారు. కాలక్రమంలో అన్యాక్రాంతమవగా, తగిన పత్రాలు లేక, స్వాధీనం చేసుకోవడంలో జాప్యం జరిగిందన్నారు. ఇటీవలి కాలంలో స్థలం పత్రాలు దొరికాయని, కమిటీ ఆమోదంతోనే 240 గజాలను విక్రయించినట్టు తెలిపారు. సభ్యులు పెండేల చంద్రశేఖర్, కొప్పురావూరి హరికిషోర్‌లు మాట్లాడుతూ విద్యానిధి కమిటీలో సభ్యులమైన తాము స్థలం తక్కువ ధరకు విక్రయించడాన్ని ప్రశ్నించామని చెప్పారు. కార్యదర్శి వివరణతో సంతృప్తి చెందినట్టు తెలిపారు. తమను ఆలపాటి రాజా బెదిరించాడనడంలో ఎటువంటి వాస్తవం లేదన్నారు. వీరితో పెండేల సుబ్బారావు, కౌన్సిలర్ దేసు యుగంధర్, తాతా శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు, యక్కల శ్రీమన్నారాయణ తదితరులున్నారు.

పంట పొలాల పరిశీలన



ఐతానగర్‌లోని పొలాల్లో జొన్న కంకులను పరిశీలిస్తున్న ఏఓ ప్రేమ్‌సాగర్, రైతులు

తెనాలిటౌన్: ద్రోణి ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండల గ్రామాల్లోని సాగులో ఉన్న మొక్కజొన్న, జొన్న పంటలు కొంత మేరకు దెబ్బతిన్నాయి. వర్షాలు రెండు రోజుల నుంచి భారీగా కురుస్తుండటంతో మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేస్తున్న రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలకు తడిచిన మొక్కజొన్న, జొన్న పంటలను వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ పరిశీలించారు.

ఐతానగర్, గుడివాడ, నేలపాడు, తేలప్రోలు తదితర గ్రామాల్లో పైరులను పరిశీలించి ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఓ ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో నీటిని తీసివేసి ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని చెప్పారు. కండెలను ఆరబెట్టాలని సూచించారు. వర్షాలకు తడవకుండా కండెలు, కంకులపై టార్పాలిన్ పట్టాలు వేసుకోవాలని సూచించారు. తెనాలి మండలంలో 400 ఎకరాల్లో మొక్కజొన్న, 200 ఎకరాల్లో తెల్లజొన్న వర్షాలకు దెబ్బతినట్లు తెలిపారు. పంట నష్టం వివరాలను అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు ఆలీ, తేజస్విని, గ్రామాల్లోని ఆర్బీకే సిబ్బంది, రైతులు ఉన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి ..

తెనాలి: అకాల వర్షాల వలన నష్టపోయిన జొన్న, మొక్కజొన్న రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్ట పరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రూరల్ మండలం తేలప్రోలు, నేలపాడు, అత్తోటలో గురువారం రైతులుతో కలసి పంట పొలాలను పరిశీలించారు. ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా నష్టపోయిన ప్రతి పొలాని రెన్యూమరేట్ చేయాలని కోరారు. తేలప్రోలు మాజీ సర్పంచ్ వేజండ్ల రోశయ్య, మహబూబ్ ఖాన్, అడుసుమల్లి పవన్, వేజండ్ల నాగేశ్వరరావు, తోమాట్టి లుతార్, అమృతలూరి సురేష్, పాల్గొన్నారు.

చలనచిత్ర రంగంలో ప్రభంజనం దాసరి



దాసరి చిత్రపటానికి నివాళి

బాపట్ల: తెలుగు చలనచిత్ర రంగంలో ఒక వినూత్న ప్రభంజనాన్ని సృష్టించిన బహుముఖ ప్రజ్ఞాశాలి దర్శకరత్న దాసరి నారాయణరావు అని సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ పేర్కొన్నారు. దాసరి నారాయణరావు 76వ జయంతి సందర్భంగా సాహితిభారతి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రావూరి మాట్లాడుతూ దాదాపు 150 చిత్రాలకు దర్శకత్వం, 250 చిత్రాలకు రచన, 53 చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించారని గుర్తుచేశారు. తెలుగు చిలన చిత్ర రంగానికి దాసరి నారాయణ చేసిన సేవలను భావి తరాలు గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాహితీభారతి నాయకులు మాల్యాద్రి, శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు, మురళీ, రాధాకృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

11 నుంచి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చికిత్సా శిబిరం

తాడేపల్లిరూరల్: రోటర్లీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆక్యుప్రెజర్, మాగ్నటిక్ చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి సెంటర్ వంశీ టాలెంట్ స్కూల్‌లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 8 గంటలకు నిర్వహించనున్నామని, ఈ శిబిరంలో అధిక బరువు, రక్తపోటు, మోకాళ్ల నొప్పులు, బ్యాక్ పెయిన్, తలనొప్పి, నిద్రలేమి, ఆస్తమా, చికెన్ గున్యా తదితర సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఆరు రోజులకు స్పాట్ రిజిస్ట్రేషన్ కేవలం రూ.200 మాత్రమేనని, రిజిస్ట్రేషన్ కోసం రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి సెక్రటరీ కాట్రగడ్డ శివన్నారాయణ, ట్రెజరర్ రామకృష్ణశెట్టి 9948074356, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కొల్లి వెంకట చంద్రశేఖరరెడ్డి, 9966227141, జొన్నా రాజేష్ 9581837979లను సంప్రదించాలని కోరారు. శిబిరంలో మహిళా థెరపిస్ట్ సౌకర్యం అందుబాటులో ఉందని, ట్రీట్‌మెంట్‌ను డాక్టర్ సత్యనారాయణచౌదరి జోథ్‌పూర్ (రాజ్), థెరపిస్ట్ జెఆర్.జత్.జాయి చౌదరిలు సేవలు అందించనున్నారని, ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

దంతలూరులో వైద్యశిబిరం



గ్రామంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

దంతలూరు(కొల్లిపర): దీర్ఘకాలిక రోగులు వైద్యులు సూచనలు మేరకు పౌష్టికాహారం తీసుకుంటూ, సరైన సమయానికి మందులు తీసుకోవాలి మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ అన్నారు. గురువారం మండలంలోని దంతలూరు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కుటుంబ వైద్యవిధానాన్ని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, రోగులను పరీక్షించి అవసరమైన మేరకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను, ఆరోగ్య శిబిరం వద్దకు రాలేని వారికి వైద్యులు స్వయంగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహించి వారి మందులు అందజేశారు. ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆరోగ్యవిస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, హెల్త్ విజిటర్ దమ్ము ఆశీర్వాదమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ అత్తోట కవిత, సచివాలయ ఆరోగ్యకార్యదర్శి అత్తోట స్వరూపరాణి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణతో నష్టం

బాపట్ల అర్బన్: మోదీ ప్రభుత్వంలో మహిళలు, కష్టజీవులకు రక్షణ లేదని, ధరలు విపరీతంగా పెరిగిపోయాయని సీపీఎం రాష్ట కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి విమర్శించారు. బాపట్ల పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం సభ్యుడు టి.కృష్ణమోహన్ అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయంతో నష్టం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్, సీహెచ్ మణిలాల్, ఎస్.బాబురావు, సీహెచ్ మజుందార్, ఆర్.వినోద్, వసంతరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి ఇత్తడి సర్వాంగం



జంపని(వేమూరు): జంపని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారం ఏకాదశి దీక్షతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శిల్పి దేవుమయాచారి తన తండ్రి శంకర్, తాత మయాచార్యులు జ్ఞాపకార్థం ఇత్తడి సర్వంగాన్ని స్వామికి సమర్పించారు. వేదాంతం మాధవ్‌కుమార్ వాస్తు, శాంతి హోమాలు నిర్వహించారు. అంగలకుదురు గ్రామస్తులు వెలగపూడి చంద్రమౌళి దంపతులు స్వామికి సింధూర లేపన ఉత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు మేడూరు శ్రీనివాసమూర్తి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.